సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 12 । నవంబర్ । 2024



అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ రేషన్ కింద పోషకాహారంగా అందించే కోడిగుడ్లలో కుళ్లిన గుడ్లు దర్శనమివ్వడంతో లబ్ధిదారులు ఖంగుతింటున్నారు. 8లో



అడ్మిన్లు బాధ్యతగా ఉండాలి

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని లేకుంటే గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి వస్తుందని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. 8లో



ఇసుక దొంగలు

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల కోసం తోలిన ఇసుకను దొంగలు తరలించేశారు. దీనిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 8లో

న్యూస్‌రీల్

21 రోజులు.. రూ.2.04 కోట్లు

చినవెంకన్నకు కాసుల పంట



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల నగదును సోమవారం లెక్కించారు. శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. 21 రోజులకు గాను నగదు రూపేణా రూ.2,04,67,691ల ఆదాయంతో పాటు 234 గ్రాముల బంగారం, 4.998 కిలోల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.500ల నోట్ల ద్వారా రూ.22 వేలు లభించినట్టు చెప్పారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయులు



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): విద్య వల్ల ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఆనాడే గుర్తించిన మహనీయులు మౌలానా కలాం ఆజాద్ ఆదర్శనీయులని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ విశేష సేవలందించారన్నారు. జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం.సత్యనారాయణ, ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ అధికారి హెచ్‌వీఎస్ మూర్తి, డీఈఓ కార్యాలయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు న్యాయం చేయాలి



నరసాపురంలో నిరసన తెలుపుతున్న వీఓఏలు

నరసాపురం : వెలుగు శాఖలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ, ఏపీ వెలుగు వీఓఏల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీఓఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వీఓఏల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, వీఓఏల తొలగింపును ఆపాలని కోరారు. మహిళా మార్ట్‌ల్లో నిర్బంధ కొనుగోళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. వీఓఏలు కె.దుర్గ, జి.స్వాతి, ఎం.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ నిధుల వసూళ్లకు చర్యలు

భీమవరం: బకాయి పీఎఫ్ నిధుల వసూళ్లకు ఈపీఎఫ్ఓ ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఈపీఎఫ్ఓ రికవరీ ఆఫీసర్ వైడీ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నవంబర్ నుంచి 2025 జనవరి వరకు ప్రత్యేక వసూళ్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈపీఎఫ్ నిధులు సకాలంలో జమ, కార్మికుల హక్కుల రక్షణ, ఈపీఎఫ్ నిధి ఆర్థికస్థితిని కాపాడడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అన్ని సంస్థలు బకాయి నిధులను త్వరగా చెల్లించి చట్టపరమైన చర్యలను నివారించుకోవాలని ఆయన కోరారు.

నిరాశపర్చిన బడ్జెట్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక బకాయిలు, మధ్యంతర భృతికి నిధుల కేటాయించకపోవడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. అలాగే ప్రభుత్వ విద్యకు 9.3 శాతం కేటాయింపు చాలా తక్కువని ప్రకటనలో పేర్కొన్నారు.

కోడ్ ముసుగులో దాటవేత

- జెడ్పీ సమావేశం పెట్టకుండా సాకులు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అంటూ నిలుపుదల
- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జెడ్పీటీసీ సభ్యులు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ
- సమావేశం జరగకుండానే వెనుదిరిగిన సభ్యులు
- జిల్లా పరిషత్‌లో గందరగోళం



ఏలూరులో కలెక్టర్‌ను కలవడానికి ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు

ఏలూరు (మెట్రో): జెడ్పీ చైర్‌పర్సన్ అవకాశవాదంపై అవిశ్వాసం పెట్టేందుకు సోమవారం జరగాల్సిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం నిలిచిపోయింది. దీనికి అధికార యంత్రాంగం సైతం తోడు కావడం గమనార్హం. ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ టీడీపీలో చేరికను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ప్రయత్నించారు. ఇటీవల ఏర్పాటుచేసిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను బహిష్కరించి జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ సమాచారం అందించి ఉదయం 9 గంటలకే సర్వసభ్య సమావేశమంటూ ప్రకటించారు. దీంతో దూరప్రాంత జెడ్పీటీసీలు ఆదివారం రాత్రి ఏలూరు చేరుకుని సోమవారం సమావేశానికి సిద్ధమవుతున్న తరుణంలో అప్పటికప్పుడు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్టు జెడ్పీటీసీలకు సమాచారాన్ని అందించారు. దీనికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని సాకుగా చూపిస్తూ తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారనేది స్పష్టత ఇవ్వకుండా 36 మంది జెడ్పీటీసీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు.



జెడ్పీ సీఈఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం



ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ సీఈఓను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

పొంతన లేని సమాధానాలు

జెడ్పీటీసీలు ఇదేమిటని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెప్పడం, సర్వసభ్య సమావేశంపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో విసిగిపోయిన వారంతా తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. జెడ్పీ సీఈఓను నిలదీసి సమావేశం ఎప్పుడు పెట్టేదీ స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉదయం 9 గంటలకు జెడ్పీ సమావేశ మందిరానికి చేరుకున్న జెడ్పీటీసీలకు మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాపరిషత్ నుంచి గాని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ నుంచి గాని ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసేందుకు బయలుదేరారు.

తక్షణమే అవిశ్వాసం పెట్టాలి

జిల్లాపరిషత్ సమావేశ మందిరం నుంచి ప్లకార్డులతో కలెక్టరేట్‌కు చేరుకుని జెడ్పీ చైర్‌పర్సన్ నియంతృత్వ పోకడలపై విమర్శలు చేశారు. తక్షణమే అవిశ్వాసం పెట్టి ఆమెను తొలగించాలని నినదిస్తూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. 36 మంది జెడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమవ్వగా కలెక్టరేట్ వద్ద పోలీసులు వారిని నిలువరించడంతో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ కలెక్టర్‌ను కలిసే తీరుతామని జెడ్పీటీసీలు పట్టుబట్టారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు, జెడ్పీటీసీ నాయకులు పెద్దిరాజు, బాబ్జి, సామంతపూడి సూర్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమయ్యారు. ఎట్టకేలకు కలెక్టర్‌ను కలిసి సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా పార్టీ మారిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం జెడ్పీ అధికారులు సైతం తమకు సహకరించడం లేదని జెడ్పీటీసీలు వాపోయారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ ఎన్నికల కోడ్ అనంతరం చర్యలు తీసుకుంటామని, సమావేశాన్ని సైతం ఏర్పాటు చేసేందుకు ముందస్తు సమాచారాన్ని జెడ్పీటీసీలకు అందిస్తామని చెప్పడంతో వారంతా శాంతించారు.

కాలినడక మార్గం శుభ్రం



కొండపైన పాత టోల్‌గేట్ ప్రాంతంలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో క్షీణించిన పారిశుద్ధ్యంపై సోమవారం 'సాక్షి'లో 'శ్రీవారి క్షేత్రంలో పారిశుద్ధ్య లేమి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆలయ ఈఈ డీవీ భాస్కర్ భక్తులు పాదయాత్రగా క్షేత్రానికి వచ్చే (కొండపైన పాత టోల్‌గేట్) మార్గం వద్ద పేరుకుపోయిన చెత్తను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. వెంటనే పొక్లయిన్‌తో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. వెంటనే ఆ ప్రాంతంలోని పొదలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య లోపానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

29న సీజీఆర్‌ఎఫ్ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: జంగారెడ్డిగూడెం డివిజన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 29న సదస్సు నిర్వహించనున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెంలో సదస్సు నిర్వహిస్తామని, విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

కలెక్టర్ నాగరాణి



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా చర్యలు ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 164 వినతులు అందాయి. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- వీరవాసరం మండలం నవుడూరులో ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకున్నారని, వీటిని తొలగించాలని గుబ్బల సత్యనారాయణ ఫిర్యాదు చేశారు.
- భీమవరం మండలం కొమరాడలో పశువుల చెరువు గట్టును ఆక్రమించుకుని సెప్టిక్ ట్యాంకులు నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు ఆర్.శక్తీశ్వరరావు అర్జీ అందజేశారు.

గ్రామ వ్యవస్థల నిర్వీర్యానికి ఎత్తుగడ

- సచివాలయ, ఆర్‌బీకే భవనాల్లో ఇతర కార్యాలయాలు
- ఉండి, పాలకోడేరులో ఏర్పాటు
- మరిన్ని భవనాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- గత ప్రభుత్వంలో 353 సచివాలయాలు, 298 రైతు భరోసా కేంద్రాలు 214 హెల్త్ క్లినిక్‌ల మంజూరు
- గతంలోనే 70 శాతం భవనాల నిర్మాణం పూర్తి

సాక్షి, భీమవరం : గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థల్ని నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వాటి కోసం ప్రత్యేక డిజైన్లతో నిర్మించిన పక్కా భవనాల్లో ఇతర కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో రెండు భవనాల్లో మార్పులు చేయగా మరికొన్నిచోట్ల ఈ ఆలోచనలో పాలకులు ఉన్నట్టు తెలుస్తోంది.

గతంలో పాలనను పల్లెకు చేరుస్తూ..

ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యయప్రయాసల కోర్చి మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పనిలేకుండా గత ప్రభుత్వం సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ వ్యవస్థల ద్వారా పాలనను పల్లెకు చేర్చింది. ఒక్కో భవనం సుమారు రూ.40 లక్షల చొప్పున రూ.141.2 కోట్ల వ్యయంతో జిల్లాలో 353 సచివాలయం, రూ.22 లక్షల చొప్పున రూ.65 కోట్లు వెచ్చించి 298 ఆర్‌బీకేలు, రూ.25 లక్షల చొప్పున రూ.53.5 కోట్ల వ్యయంతో 214 హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలు చేపట్టింది.



పాలకోడేరులోని సచివాలయ భవనంలో ఏర్పాటుచేసిన తహసీల్దార్ కార్యాలయం

ప్రత్యేక డిజైన్లతో భవనాలు

ప్రజలు, ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండేలా కార్పొరేట్ తరహాలో ఈ భవనాలను ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. సచివాలయాల్లో ఉద్యోగుల కోసం కింద రెండు గదులు, ఒక హాల్, శానిటేషన్ సామగ్రి ఉంచేందుకు స్టోర్ రూం, మొదటి అంతస్తులో రెండు గదులు, సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా విశాలమైన హాల్‌తో డూప్లెక్స్ తరహాలో భవన నిర్మాణాలు చేశారు. ఆర్‌బీకే భవనాన్ని ఒక వరండా, వ్యవసాయ సిబ్బంది కోసం రెండు గదులు, రైతులతో సమావేశాల నిర్వహణ, ఎరువులు, భూసార పరీక్షలు, వ్యవసాయ సమాచారం ప్రదర్శన, కియోస్కో ఏర్పాటుకు వీలుగా విశాలమైన హాలుతో డిజైన్ చేశారు. వైద్యుడి గది, ల్యాబ్, స్థానికంగా వైద్య సిబ్బంది నివాసం ఉండేందుకు, ఇతర వసతులతో హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. గత ప్రభుత్వంలోనే 270 సచివాలయ, 211 ఆర్‌బీకే, 96 హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి.



ఉండిలోని ఆర్‌బీకేలో ఏర్పాటుచేసిన పోలీస్‌స్టేషన్

గ్రామ స్వరాజ్యానికి తూట్లు

- ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాల్సి ఉంది. కాగా కూటమి ప్రభుత్వం సచివాలయ, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించిన భవనాలను ఖాళీ చేయించి వాటిలో ఇతర కార్యాలయాలను ఏర్పాటుచేస్తుండటం గమనార్హం.
- ఉండిలో పోలీస్‌స్టేషన్ కోసం గ్రామంలోని ఆర్‌బీకే భవనాన్ని ఖాళీ చేయించి గ్రామ శివార్లలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన పాత భవనంలో ఏర్పాటుచేశారు. ఏఎంసీ కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చడంతో ఈ భవనం ఖాళీగా ఉంది. కాగా దీనికి రంగులు వేసి రైతులు విత్తనాలు, ఎరువులు తదితర వాటిని బుక్ చేసుకునే కియోస్కో, ఇతర సామగ్రిని అక్కడికి తరలించారు.
- పాలకోడేరులో తహసీల్దార్ కార్యాలయం కోసం సచివాలయం-1 భవనాన్ని ఖాళీ చేయించారు. అందులోని ఉద్యోగులు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు.
- ఆకివీడు మండలం అజ్జమూరులోని ఆర్‌బీకే భవనంలో ఆకివీడు రూరల్ సీఐ కార్యాలయం, కాళ్ల మండలం కాళ్లకూరులోని ఆర్‌బీకే భవనంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

జిల్లాలోని పలుచోట్ల శిథిల భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే, సచివాలయ భవనాల్లో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో నేతలు ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల కోసం కొత్త భవనాలు నిర్మించకుండా సచివాలయ, ఆర్‌బీకే భవనాల్లో ఏర్పాటుచేయడం వెనుక వాటిని నిర్వీర్యం చేసే ఎత్తుగడ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీవారి తెప్పోత్సవానికి భారీ ఏర్పాట్లు



పుష్కరిణి మధ్యలో మండపానికి విద్యుద్దీప అలంకరణ చేస్తున్న దృశ్యం



భారీ కటౌట్ నిర్మిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: చినవెంకన్న తెప్పోత్సవానికి శ్రీవారి పుష్కరిణి (నృసింహ సాగరం) సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 13న రాత్రి స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరిణి మధ్యలోని మండపానికి, ఆంజనేయ స్వామివారి ఆలయానికి విద్యుద్దీప అలంకారాలు చేస్తున్నారు. ఇప్పటికే పుష్కరిణి గట్లపై ఉన్న ముళ్లపొదలను తొలగించి, విద్యుద్దీప అలంకారాలు చేశారు. తెప్పను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. సాగరాన్ని బోరు నీటితో నింపుతున్నారు. బుధవారం స్వామివారు ఉభయ దేవేరులతో తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగి రాత్రి 8 గంటల సమయంలో పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం తెప్పోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు.

బడ్జెట్‌లో అన్యాయం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దళితులు, గిరిజనులకు అన్యాయం జరిగిందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో చెల్లించలేదని, పునరావాస కాలనీల ను పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.

కొల్లేరులో అక్రమాలను ప్రశ్నిస్తే నేరమా?

ఏలూరు రూరల్: కొల్లేరులో టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తే నేరమా అని శ్రీపర్రు టీడీపీ గ్రామ అధ్యక్షుడు సైదు గోవర్ధన్ ప్రశ్నించారు. సోమవారం ఆయన ఏలూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు నంబూరి నాగరాజు, మాజీ అధ్యక్షుడు నేతల రవి అక్రమాలను వీడియోలో వెల్లడించారు. కొల్లేరు పరిసరాల్లోని అభయారణ్యం చెరువుల్లో సాగు చేసుకుంటూ జీవిస్తున్న పేదలను బెదిరించి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల అధ్యక్షుడిగా వ్యవహరించిన నేతల రవి కొల్లేరులో అక్రమ చెరువులు తవ్వి, లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకున్నాడన్నారు. ఆ సమయంలో కోమటిలంక ప్రజలు రవిపై తిరగబడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి చర్యలను సహించలేని కొల్లేరు ప్రజలు 2019లో టీడీపీని ఓడించారన్నారు. ఇప్పుడు మళ్లీ అధికారం చేపట్టగానే అక్రమాలకు తెరతీశారని, ఇటీవల పచ్చనేతలు రూ.5 లక్షలు డిమాండ్ చేశారంటూ పైడిచింతపాడు సర్పంచ్ చేసిన ఆరోపణలకు టీడీపీ నాయకులు సమాధానం చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారం చేపట్టిన ప్రతిసారీ కొల్లేరు నాయకులుగా చలామణి అవుతూ ప్రజలను జలగల్లా పీల్చుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలపై ప్రశ్నిస్తుంటే తనపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని గోవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న టీడీపీ నేత గోవర్ధన్

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ఏలూరు (టూటౌన్): ఇసుక ర్యాంపులను ప్రభుత్వమే నిర్వహించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు ఏలూరులో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. బుచ్చిబాబు మాట్లాడుతూ ఇసుకపై జీఎస్టీతో పాటు ఇతర పన్నులు రద్దుచేయాలని కోరారు. ఎన్నికల్లో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత కూటమి పాలకులు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక ఆచరణలో ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మద్ది'లో కార్తీక మాసోత్సవాలు



మద్ది క్షేత్రంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్తీక సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, దీపారాధనలుచేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రాతఃకాలార్చన, తోమాలసేవ, గోపూజ, నిత్యహోమ బలిహరణలు నిర్వహించారు. ఏక త్రింశత్ (31)వ వార్షిక సప్తాహ మహోత్సవాల మహా పూర్ణాహుతి, దీక్షావిరమణ, సప్తాహ మహోత్సవ పరిసమాప్తి అనంతరం భజనపాలీలకు ఈవో ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వదించి, స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.

కొత్తోటలో కోళ్లఫారం దగ్ధం

మొగల్తూరు: మండలంలోని కొత్తోట గ్రామంలోని కవురు గోపన్నకు చెందిన కోళ్లఫారం ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. గ్రామంలో సుమారు 80 కోడి పిల్లలతో పాటు సంక్రాంతి పండుగకు పందెం కోళ్లను మేపుతున్నట్లు బాధితుడు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి కోళ్లఫారం దగ్ధమవుతుందని గ్రామస్తులు తనకు సమాచారం అందించడంతో, వెళ్లేసరికే కోళ్లఫారం పూర్తిగా దగ్ధమైందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని, సోమవారం మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ భీమారావు

భీమవరం: అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ వి భీమారావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఏడుగురు బాధితులు తమ సమస్యలను విన్నవించుకోగా వెంటనే చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఏఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు

ఇదేనా పౌష్టికాహారం అంటూ మండిపడుతున్న తల్లిదండ్రులు



ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఫిరంగుల దిబ్బ అంగన్‌వాడీ కేంద్రం



చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న నాణ్యత లేని గుడ్లు



కుళ్లిన కోడిగుడ్డు

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ రేషన్ కింద పోషకాహారంగా అందించే కోడి గుడ్లలో కుళ్లిన గుడ్లు దర్శనమివ్వడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పోషకాహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఎలా అని మండిపడుతున్నారు. స్థానిక శాంతి నగర్ 9వ రోడ్డులో పి.రమేష్, అనిత దంపతులు నివాసం ఉంటున్నారు. వారి రెండో కుమార్తె అన్వికకు సమీపంలోని ఫిరంగుల దిబ్బ అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రతి నెలా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త అందజేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చిన్నారికి కోడిగుడ్డును ఉడకబెట్టి ఇచ్చేందుకు చిన్నారి తల్లి సిద్ధమవ్వగా గుడ్డు కుళ్లిన వాసన వచ్చింది. ఆమె గుడ్డును పగులగొట్టగా కుళ్లిపోయి ఉండటం కన్పించింది. దీంతో తల్లిదండ్రులు కంగారుపడి ఇంట్లో ఉన్న గుడ్లు అన్నింటినీ బయట పారవేశారు. కుళ్లిన గుడ్లు వచ్చాయంటూ స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించగా మాకు వచ్చిన గుడ్లు అవే.. మేము ఏం చేస్తాం అంటూ సమాధానం ఇవ్వడంతో చిన్నారి తల్లిదండ్రులు బిత్తరపోయారు. దీనిపై ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు సైతం మొక్కుబడి సమాధానం చెప్పడం గమనార్హం. అప్పుడప్పుడు ఒకటి, రెండు చోట్ల గుడ్లు నిల్వ ఉండటం వల్ల కుళ్లుతున్నాయంటూ చెప్పుకొచ్చారు.

లబ్ధిదారుల్లో ఆందోళన

ఏలూరు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య 74,520గా ఉంది. వీరిలో 6 నెలల నుంచి 3 సంవత్సరాల వయసు కలిగిన వారు 41,116 మంది, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు ఉన్న వారి సంఖ్య 19,909 మంది ఉన్నారు. గర్భిణులు 7,889 మంది, బాలింతలు 5,606 మంది వరకూ ఉన్నారు. అయితే ప్రభుత్వం అందించే పోషకాహారంలో ఇలా కుళ్లిన కోడిగుడ్లు సరఫరా కావడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పోషకాహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్నారు.

ఎక్సైజ్ దాడులు



మాధవరంలో బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాలిన భవానీ శంకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, ఎస్సై బి.రాజేంద్రప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో దాడులు నిర్వహించగా బెల్టు దుకాణం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో గూడెం సీఐ కేఎస్‌వీ కళ్యాణ్‌కుమార్, ఎస్సై మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్లు బాధ్యతగా ఉండాలి

ఐజీ అశోక్‌కుమార్



పాలకొల్లులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

పాలకొల్లు సెంట్రల్: సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు ఒకటికి పదిసార్లు పరిశీలించుకోవాలని, లేదంటే ముఖ్యంగా గ్రూప్ అడ్మిన్స్ బాధ్యత వహించాల్సి వస్తుందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన పర్యవేక్షించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఐజీ అశోక్‌కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సెల్ పని చేస్తుందన్నారు. గంజాయిని 10 నుంచి 15 కేజీల వరకూ ద్విచక్ర వాహనాలపై తీసుకువస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరందరిపైనా పీడీ యాక్టు బనాయిస్తామన్నారు. కొందరు పోలీసులమని చెప్పి మీ పేరున కొరియర్‌లో గంజాయి వచ్చిందని, మీ పిల్లలు ఓ కేసులో ఇరుక్కున్నారని అర్జెంటుగా డబ్బులు కట్టకపోతే కేసు కట్టేస్తామని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి ఫేక్ కాల్స్‌కు ఎవ్వరూ భయపడవద్దన్నారు. ఎవరికైనా సైబర్ ద్వారా నగదు పోతే 3 గంటలలోపు పోలీసులకు గాని 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ అవ్వకుండా నిలుపుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాల్లో భాగంగా ఓ కేసు విషయంలో విచారణ కోసం హర్యాణా, రాజస్తాన్ వరకూ వెళ్లవలసి వచ్చిందన్నారు. ఆ కేసులో కొందరిని గుర్తించగా ఓ 25 ఏళ్ల కుర్రాడు ఓ కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసుకుని 14 సంవత్సరాల పిల్లలతో ఈ నేరాలు చేయిస్తున్నాడని తెలిపారు.

టెక్నాలజీతో కేసులను ఛేదిస్తున్నాం

టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసులను ఛేదించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. స్టేషన్లలో సిబ్బంది తక్కువగా ఉండడానికి పలు కారణాలు ఉన్నాయన్నారు. హోమ్‌గార్డులు వాళ్ల రిక్రూట్ మెంట్‌పై కోర్టుకు వెళ్లారని, డిసెంబర్‌లో రిక్రూట్‌మెంట్ జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి జిల్లాకు సుమారు 8 నుంచి 10 వేల సీసీ కెమెరాలు అవసరమవుతున్నాయన్నారు. అలాగే రేంజ్ పరిధిలో ఆరు జిల్లాలకు దాదాపుగా లక్ష కెమెరాలు కావలసి ఉందని అన్నారు. స్పెషల్ టెక్నాలజీతో ఫేషియల్ ఐడెంటీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి వంద మంది ఉండే ప్రాంతంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలనే నిబంధనలను అమలు చేస్తామన్నారు. సైబర్ క్రైంపై విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తద్వారా ఇంటి వద్ద తల్లిదండ్రులతో చర్చించుకోవడం ద్వారా అందరికీ సమాచారం తెలుస్తుందన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో...

పాలకొల్లు విచ్చేసిన ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ పార్వతి అమ్మవార్ల దర్శనానంతరం ఆలయ ప్రాకార మండపంలో ఐజీకి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయం బయట సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, అడిషినల్ ఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కె.రజనీకుమార్, జి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు

మొగల్తూరు: గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి విశాఖ మీదుగా గంజాయిని తరలించే ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. షీ టీమ్, మహాశక్తి టీమ్, మహిళా పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మహిళలు, యువతులపై వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువత బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల వ్యవహారశైలిపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ ఎన్‌బీకే మురళీకృష్ణ, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు జీ.వాసు, నాగలక్ష్మి తదితరులున్నారు. ముందుగా మొగల్తూరు స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి



సీపీఎం ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న శ్యామల రాణి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ వల్ల మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని సీపీఎం జిల్లా నాయకురాలు ఏ.శ్యామల రాణి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏలూరు టౌన్‌లో నిర్వహించిన సీపీఎం ప్రజాపోరు యాత్రలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఈ నాలుగు నెలల్లోనే వందల కొలది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్య ఘటనలు వెలుగు చూశాయని అన్నారు. ఈ విషయంలో హోం మంత్రి ఫెయిల్ అయ్యారని స్వయంగా డిప్యూటీ సీఎం ప్రకటించడం అంటే రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించడమే అన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానాన్ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మద్యం లిక్కర్ 99 రూపాయలకే ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, మహిళలకు అవసరమైన వంట నూనె ధరను ఎందుకు రూ.99కే ఇవ్వలేకపోతుందని ప్రశ్నించారు. బయట మార్కెట్లో పప్పు దినుసులు, చింతపండు, వంట నూనెలు, కూరగాయలతో సహా ధరలు ఆకాశన్నంటుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఏలూరు వన్ టౌన్‌లోని పడమర వీధి, వంగాయ గూడెం, ఆముదాల అప్పలస్వామి కాలనీ, అరుంధతి పేట, దక్షిణపు వీధి తదితర ప్రాంతాల్లో ప్రజాపోరు యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం పడమర వీధి శాఖ కార్యదర్శి వైఎస్ కనకారావు, నాయకులు పి.ఆదిశేషు, కే లెనిన్, ఎస్ సత్యనారాయణ, జి.శారద, వీవీఎస్ ప్రసాద్, దుర్యోధన, అన్నవరం, శ్రీనివాసు, చల్లా పైడయ్య, పి.సత్తిరాజు, జి.కోటేశ్వరరావు, జె గోపి, మీసాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సుబ్బరాజు మృతదేహం

కాళ్ల: పెదఅమీరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ల పోలీసులు సోమవారం తెలిపారు. కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కూనపురాజు సత్యసూర్య వెంకట సుబ్బరాజు (60) ద్విచక్ర వాహనంపై భీమవరం పట్టణంలోని కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. కాళ్ల మండలం పెదఅమీరం పరిధిలో ఉన్న ఉండి – భీమవరం రోడ్డులోని అశోక్ లేలాండ్ షోరూం వద్దకు వచ్చేసరికి రహదారి పక్కన ఆగిఉన్న కారు డోర్ అకస్మాత్తుగా తీయడంతో ద్విచక్ర వాహనంకు తగిలింది. దీంతో సుబ్బరాజు రోడ్డుపై పడిపోయాడు. వెనకనుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతని తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుని అల్లుడు ఇందుకూరి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యూనియన్ బ్యాంక్ వద్ద చోరీ

చింతలపూడి: యూనియన్ బ్యాంక్ వద్ద చోరీ జరిగిన ఘటన చింతలపూడిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం, రేచర్ల గ్రామానికి చెందిన చెక్క శ్రీనివాసరావు తన భార్యతో కలిసి సోమవారం సాయంత్రం స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ రూ.4 లక్షలు విత్ డ్రా చేసి బ్యాంకు ఆవరణలో తన ద్విచక్ర వాహనంలో పెట్టారు. వీరు పక్కకి వెళ్లి మాట్లాడుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ నగదును అపహరించుకుపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా డీఎస్పీ రవిచంద్ర, సీఐ ఎస్ రవీంద్ర నాయక్, ఎస్సై కుటుంబరావు ఘటనా స్థలానికి వచ్చి బ్యాంక్‌లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ డాక్టర్ ఉదంతంపై కేసు నమోదు

పెనుగొండ: సోమరాజు చెరువులో నకిలీ డాక్టర్ ఉదంతంపై విచారణ నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమరాజు చెరువులో తేజ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో వైద్యం జరిగినట్లు కథనాలు వెలువడడంతో పెనుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. వైద్యాధికారి తనిఖీలు నిర్వహించి కడలి కృష్ణ తేజ అనే వ్యక్తి పి నవీనకు చెందిన ఫార్మసిస్ట్ సర్టిఫికెట్లపై మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడని, యాంటి బయోటిక్స్, స్టెరాయిడ్, నొప్పుల నివారణ మందులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అయితే, ప్రస్తుతం వైద్యం చేసినట్లు ఆధారాలు లేకుండా చేశారని తెలిసిందన్నారు. ఇదిలా ఉండగా ఇదే చోట కడలి కృష్ణబాబు అనే వ్యక్తి ఎంబీబీఎస్ ఎముకల వైద్యునిగా శస్త్రచికిత్స చేశారని ఫిర్యాదు రాగా, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉందన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

భోగాపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బాల, బాలికల 68వ అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో పి.నవీన్‌కుమార్, బాలికల విభాగంలో ఎం.మహాలక్ష్మి, కె.మహాశ్రీ లక్ష్మి ఏపీ అండర్–14 వాలీబాల్ బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడు అధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు పర్యవేక్షించారు.

పంచారామంలో మహిళా అఘోరా



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పంచారామ క్షేత్రాన్ని సోమవారం మహిళా అఘోరా దర్శించుకున్నారు. ఆమె శ్రీ ఉమాసోమేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆమెను ఆసక్తిగా తిలకించారు.

జగనన్న కాలనీలో తువ్వ ఇసుకను తవ్వేశారు



కొంతేరు జగనన్న కాలనీలో తవ్వుకుపోయిన తువ్వ ఇసుక దిబ్బలు



ఆ ఇసుకతో కొంతేరులో పూడ్చిన బేస్‌మెంట్

యలమంచిలి: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల కోసం తోలిన ఇసుకను కొందరు దొంగలు అక్రమంగా తరలించేశారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాలకొల్లు పట్టణ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కొంతేరు గ్రామంలో భూమి సేకరించారు. ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బేస్‌మెంట్ పూడ్చడానికి తువ్వ ఇసుక కూడా తోలారు. ఆ సమయంలో వర్షాలు రావడంతో తువ్వ ఇసుక అలా వదిలేశారు. ఈలోపు ఎన్నికల షెడ్యూల్ రావడం, ఎన్నికల తరువాత ప్రభుత్వం మారిపోవడంతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ప్రారంభంకాలేదు. దీంతో ఆ ఇసుక దిబ్బలు అలా ఉండిపోయాయి. గత శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో, ఇదే అదనుగా కొందరు దొంగలు ఆ తువ్వ ఇసుక దిబ్బలను తవ్వేసి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. ఈ విషయం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గృహ నిర్మాణ శాఖ అధికారులు సోమవారం ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లారు. ఇసుక తవ్విన వ్యక్తిని గుర్తించి ప్రశ్నించగా ఈ ఇసుక తనదేనని, ఇక్కడ నిల్వ చేసుకున్నానని దబాయించాడు. దీంతో పాలకొల్లు అర్బన్ హౌసింగ్ ఏఈ డి రమేష్ యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్షీరారామంలో కార్తీక శోభ





క్షీరారామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు, క్యూలైన్లో వేచిఉన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం రెండవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు శివనామస్మరణతో పులకించారు. మహిళలు వేకువజాము నుంచి కాలువ స్నానాలు ఆచరించి కాలువలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు నిండిపోయాయి. స్వామివారికి మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తులతో ఆలయం వెనుకభాగం, అభిషేకాల మండపం నిండిపోయింది. మధ్యాహ్నం 11 గంటల నుంచి పంచారామ యాత్రికులతో ఆలయం పోటెత్తింది. రాత్రి 8 గంటల వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 45 వేల మంది వరకూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. స్థానిక రేపాక వారి సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. క్షీరారామలింగేశ్వస్వామి సేవా సమితి, యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్సైలు, పోలీసు, సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'వాసవీ'లో వరుణ్‌తేజ్ సందడి



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేస్తున్న నటుడు వరుణ్‌తేజ్

తాడేపల్లిగూడెం: మట్కా సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నటుడు వరుణ్‌తేజ్ సోమవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేశారు. రతన్‌ఖేత్రి అనే వ్యక్తి జీవితం ఆధారంగా నిర్మించిన ఈ చిత్రం అందరిని ఆకర్షిస్తుందని ఆయన చెప్పారు. సహ నటుడు సత్యం రాజేష్, విద్యార్థులతో కలిసి సందడి చేశారు. వరుణ్‌తేజ్‌తో ఫొటోలు దిగడానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పెనుగొండ: ఆచంట మండలం పుచ్చల్లంకలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న యడ్ల శ్రీనివాసరావును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి మహేష్, జి రఘు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు



వీరంపాలెం శైవక్షేత్రంలోని విశ్వేశ్వరస్వామి వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పీఠంలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరస్వామి వారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాకు తరలివెళ్తున్న తాడేపల్లిగూడెం భవన నిర్మాణ కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం భీమవరంలో తలపెట్టిన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పట్టణంలో నాయకులు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే వినియోగించాలని, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించాలని, ఇసుక అందరికి అందుబాటులో ఉండేలా శాశ్వత చర్యలు చేపట్టాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వా శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు



అత్తిలి ఉమాసిద్ధేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాలలో హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ప్రసిద్ధిగాందచిన ఉమాసిద్ధేశ్వరస్వామి ఆలయానికి వేకువజామున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీస్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ, సిద్ధేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు.

వేణుగోపాలస్వామికి అభిషేక పూజలు



విశేష అలంకరణలో శ్రీవేణుగోపాలస్వామి

అత్తిలి: అత్తిలిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీకమాసం దశమి పర్వదినం సందర్భంగా విశేష అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు నిర్ధారణ ఐతే సంబంధిత స్కానింగ్ సెంటర్ల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. సోమవారం తన చాంబర్‌లో లింగ నిర్ధారణ నివారణ సబ్ డివిజనల్ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఆర్డీఓ రాజు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కమిటీ సభ్యులు తరచూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిర్ణీత గడువులో స్కానింగ్ సెంటర్లను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, కమిటీ కన్వీనర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సీహెచ్ స్వరూప్, న్యాయ సలహాదారుడు చల్లా దానయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జనం బెంబేలు.. పట్టని సర్కారు

- గత ప్రభుత్వంలో పేదలపాలిట సంజీవనిగా ఆరోగ్య సురక్ష
- ఖరీదైన వైద్యం ఇంటి ముంగిట్లోకే
- జ్వరాలకు కూడా వైద్యం చేయలేని నేటి కూటమి ప్రభుత్వం
- నేడు జ్వరాలతో అల్లాడుతున్న పేదవర్గాలు



తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగుల వివరాలు నమోదుచేసుకుంటున్న వైద్యసిబ్బంది (ఫైల్)

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో వైద్యానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చే పరిస్థితిఉండేది. ఇందులో భాగంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీని రూ. 25లక్షలకు పెంచడంతో పాటు 3,257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్సను అందజేసి ప్రజల మన్ననలు పొందారు. అంతటితో ఆగకుండా ఇంటిచెంతకే సర్కారు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. వైఎస్సార్ ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి ఒక్క పేదోడి ఇంటికి సమీపంలోనే వైద్యశిబిరం ఏర్పాటుచేసి అన్ని రకాల విభాగాలకు సంబంధించిన వైద్యాన్ని ఉచితంగా అందజేశారు. ఇలా రెండు దఫాల్లో పేదలకు ఉచిత వైద్యాన్ని చేరువచేసి తద్వారా ప్రమాదకరమైన రోగాలను ముందుగానే గ్రహించి మెరుగైన వైద్యం సత్వరమేచేసిన ఘనత సాధించారు. తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీతోపాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో సచివాలయం పరిధిలో ఈ వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా...

సచివాలయాల ద్వారా ఏఎన్ఎంలు, వలంటీర్లు ప్రజల ఇంటి గుమ్మంలోకి వెళ్లి సర్వే చేసి వైద్యం అవసరమైన వారికి టోకెన్‌లు అందజేశారు. వైద్య శిబిరం నిర్వహించే తేదీ చెప్పి ఆరోజు ఆ టోకెన్ ద్వారా శిబిరంలో అందుబాటులో ఉన్న స్పెషలిస్ట్ వైద్యులచే వైద్యసేవలందించడమే కాకుండా ఉచిత రక్త పరీక్షలు నిర్వహించేవారు. దీంతో ప్రజలు స్థానికంగానే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు అధికసంఖ్యలో వచ్చి వైద్యసేవలు పొందే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా ఈ శిబిరాల్లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, మానసిక వైద్య నిపుణులు, కంటి విభాగం, కార్డియాలజీ, యూరాలజిస్ట్, డెంటిస్ట్ విభాగం, చంటి పిల్లల వైద్య నిపుణులను అందుబాటులో ఉంచేవారు. దీంతో ప్రజానీకం దూరప్రాంతాలకు వెళ్లి పొందే వైద్యం కూడా ఇంటిచెంతకే అందుబాటులోకి వచ్చిందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

నేడు జ్వరాలతో అల్లాడుతున్నా పట్టించుకునేవారే లేరు

నేటి కూటమి ప్రభుత్వహయాంలో జ్వరాలు విలయతాండవంచేస్తూ ప్రజలు అప్పులపాలవుతున్నా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజానీకం గుర్రుగా ఉన్నారు. వైరల్ జ్వరాలతోపాటు టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి జ్వరాలు విజృంభిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. వైరల్ జ్వరాలు విజృంభిస్తుండడమే కాకుండా ఒంటి నొప్పులు, కాళ్ల నొప్పులతో రోగులు అల్లాడిపోతున్నారు. దీంతో పేదవర్గాలు సైతం చేసేదిలేక ప్రైవేటు వైద్యానికి వెళ్లి జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు



జగన్ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. అన్ని రకాల వైద్య విభాగాలను ప్రజల చెంతకే తీసుకువచ్చి వైద్య శిబిరం ద్వారా మంచి వైద్యం అందజేశారు. రెండు దఫాలుగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాల్లో వేలాది మంది పేద, మధ్యతరగతి వర్గాలు ఖరీదైన వైద్యసేవలు ఉచితంగా పొందేవారు. కానీ నేడు విష, వైరల్ జ్వరాలతో పేదవర్గాలు అల్లాడుతున్నారు. సంక్షేమం లేకపోవడంతో వైద్యం చేయించుకునే స్థోమత లేక అప్పుల పాలైపోతున్నారు. కూటమి ప్రభుత్వం జ్వరపీడితుల కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు చేయకపోవడం చాలా బాధాకరం. పేద, మధ్యతరగతి వర్గాలు అల్లాడుతున్నా వైద్యశిబిరాలు నిర్వహించకపోవడంతో ప్రజలు అధికశాతం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాది చుట్టేయడంతో సంపాదన చాలక అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

అత్యున్నత వైద్యసేవలందాయి

గత జగన్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వేలాదిమంది పేదవర్గాలు సత్వర వైద్యం పొందారు. రెండు దఫాలుగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో అత్యున్నత వైద్యసేవలు అందజేశారు. ఖరీదైన విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు శిబిరాలు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందచేశారు.

– జంగం ఆనంద్ కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు

జగనన్న ఆరోగ్య సురక్ష చరిత్రాత్మకం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకం. ముఖ్యంగా పేదవర్గాలకు ఖరీదైన వైద్యం ఉచితంగా ఇంటివద్దకే అందుబాటులోకి తీసుకువచ్చారు. జవాబుదారీగా అందించిన వైద్యం ప్రజలందరూ స్వాగతించారు. ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటికొచ్చి మరీ వైద్యానికి రావాల్సిందిగా పిలిచి మరీ వైద్యం అందించారు.

– ఎస్వీ జాకబ్‌బాబు, రిటైర్డు ఉపాధ్యాయులు, తణుకు

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

జగన్ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంతో మంది పేదవర్గాలకు గుండె జబ్బులు, వెన్ను నొప్పి, కంటి, గైనిక్ సమస్యలకు సంబంధించి అత్యున్నత సత్వర వైద్యం అందింది. ఇంటి గుమ్మంలోకి వచ్చి రోగం తాలూకా వివరాలు అడిగి మరీ అందించిన వైద్యాన్ని ప్రజలు స్వాగతించారు. – ఎన్నా రాజీ, తణుకు

వైభవంగా లక్ష దీపోత్సవం



దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ పద్మావతి, వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని లక్షదీపోత్సవం నిర్వహించారు. కేంద్ర సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవం ప్రారంభించారు. కాలనీవాసులు దీపోత్సవంలో పాల్గొని కార్తీక దీపారాధన నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంతేటి వెంకటరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పాలకొల్లు అర్బన్: బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారి బి.నెహమ్యా అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దత్తత మాసోత్సవాల్లో భాగంగా బాలల సంరక్షణ చట్టాలు, బాలల చట్టాలపై అవగాహన, బాలల జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు తదితర అంశాలపై బాలలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.మూర్తి మాట్లాడుతూ బాలబాలికలకు రక్షణ కోసం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 14ఏళ్ల లోపు పిల్లలు పనులు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బడి ఈడు పిల్లలను పనులు చేస్తుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.విజయకుమారి, కె.సత్యశ్రీ, జీవీ కుమారి, కుసుమే రాణి, కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, సోషల్ వర్కర్ కె.స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాపోరు



తణుకులో కొండాలమ్మ పుంతలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడ్డగర్ల అజయ కుమారి కోరారు. సోమవారం తణుకులోని కొండాలమ్మ పుంతలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు కార్యక్రమాన్ని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. మహిళా బిల్లు ఆమోదించినప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలు కారణంగా మహిళలు కుటుంబాన్ని నెట్టుకురావడం చాలా కష్టంగా ఉందన్నారు. ఇసుక లభ్యత లేకపోవడంతో ఎక్కువ మంది మహిళలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గార రంగారావు, దేవి, ఉమామహేశ్వరరావు, రాధ, లక్ష్మి, చిట్టెమ్మ, కనకరత్నం, రమణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

తణుకు టౌన్: వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వేల్పూరు సీపీఎం కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా చేపట్టిన ప్రజా పోరు ఇంటింటి ప్రచారాన్ని సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పసి బిడ్డ నుంచి వృద్ధుల వరకూ, బాలికలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు నివారించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. వాసా వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, వాసా పోసియ్య, కర్రెళ్ల అర్జున్, వీ ధన సత్యనారాయణ పాల్గొన్నారు.

బడ్జెట్లో సామాన్య ప్రజలకు అన్యాయం



కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర బడ్జెట్లో సామాన్య ప్రజలకు అన్యాయమే జరిగిందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విమర్శించారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన ధరలతో సామాన్యులు, పేద ప్రజలు విలవిలాడిపోతూ ఉంటే కనీసం ధరల ఊసే ఎత్తకుండా ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం పాటిస్తుందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగానికి 11 వేల కోట్లు చాలీచాలని నిధులు కేటాయించారని, రైతులు, కౌలు రైతులను దారుణంగా అవమానించారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బీసీ సబ్‌ప్లాన్ కేటాయింపులు లేకుండా ఎన్నికల హామీలను నీరుగార్చేసి మోసం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది పేదలు ఇళ్ల స్థలాలు కోసం నిరీక్షిస్తుంటే కేవలం ఈ ఆర్థిక సంవత్సరంలో 1 లక్ష 79 వేల గృహాలు మాత్రమే మంజూరు చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రతిపాదనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కేవలం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలో దారుణమైన ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న దగా కూటమి ప్రభుత్వంపై రాబోవు రోజుల్లో ప్రజలను సమీకరించి నిరంతర పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి



మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భారతదేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కలలుగన్న అందరికీ విద్య అనేది నిజం కావాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని పలువురు వక్తలు కొనియాడారు. జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీ ఇందిరా కుమారి, డీ కనక మహాలక్ష్మీ, కే జీవన్ బాబు, వి శివప్రకాష్, తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలలో..

జాతీయ విద్యా దినోత్సవాన్ని తణుకు మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తేతలి, పైడిపర్రు, వెంకట్రాయపురం పాఠశాలల్లో జరిగిన జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాల్లో దేశ మొదటి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రాయపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ఆంగ్ల బాషలో అష్టావధానం నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ప్రదానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయిని నాగోతు అమ్మాజీ, పీసీ కమిటీ చైర్మన్ పాలమూరి లావణ్య, విజయ లక్ష్మీ, ఉమామహేశ్వరి, ప్రశాంతి, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మూర్తిరాజుకు ఘన నివాళులు



మ్యాథ్స్ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న విద్యార్థులు

తణుకు అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు చింతలపాటి సీతావరప్రసాద్ మూర్తిరాజు వర్ధంతి సభ సోమవారం పాఠశాల హెచ్ఎం టి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తిరాజు చిత్రపటానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు (జనతరాజు) ఐఎంకేఎస్ రాజు (యోగా రాజు) పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పాఠ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత ఉపాధ్యాయని ఎస్‌కే రజియా ఆర్థికసాయంతో పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, డి.మంగతాయారు, పీఎస్ విజయలక్ష్మి, కె.అరుణ, ఉదయ భాస్కర్, విమల, విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అత్తిలి: ఈనెల 14 నుంచి అత్తిలి శాఖా గ్రంథాలయంలో 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి డి కృష్ణారావు సోమవారం తెలిపారు. 14న జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలు ప్రారంభమౌతాయని చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, 16న చిత్రలేఖనం, 17న వక్తృత్వం, 18న పాటలు పోటీలు. 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు కార్యక్రమం, బహుమతి ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

పెంటపాడులో..

పెంటపాడు: ఈనెల 14 నుంచి పెంటపాడు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు లేబ్రేరియన్ జుల్ఫికర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ జెండా ఎగురవేస్తారన్నారు. 20 తేదీవరకు పలు విద్యా, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలీ తెలిపారు. విద్యార్థుల, చదువరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు



అత్తిలిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీహాల్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు అత్తిలి మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి చిత్రపటాన్ని మేళతాళాలతో ఊరేగింపు ఉత్సవం జరిపారు. అనుపోజు వీరాచార్యులు, చినసత్యవతి దంపతులచే మహాగణపతి పూజ, ప్రధాన కలశారాధన, అష్టోత్తర శతనామావళి, కలశస్థాపన కార్యక్రమాలు జరిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పట్నాలబాబు, కార్యదర్శి అనుపోజు అప్పలాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘనాయకులు బల్లంకి ఆచారి, పట్నాల కృష్ణ, నాగరాజు, ముదపాక బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అత్తిలి: స్థానిక గౌడవీధి గణపతి మందిరం వద్ద సోమవారం అఖండ అన్నసమారాధన జరిపారు. 14వ గణపతి వార్షిక మహోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి



గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేది గురువారం నుంచి 20వ తేదీ బుధవారం వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సోమవారం గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు, వారోత్సవాలు కమిటీ సభ్యులు గ్రంథాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు తప్పక విద్యార్థినీ విద్యార్థులను గ్రంథాలయానికి పంపాలని కోరారు. సమావేశంలో గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.జాన్‌బాబు, ఎస్.సత్యం, వెంకట్, జయప్రద, తనూజ, జే.ప్రేమకుమార్, ఎ.జనార్ధనరావు, మున్ని, నాగ కమల, ఏవీ లక్ష్మణరావు, డి.సత్యానారాయణలు పాల్గొన్నారు.

యంత్రాలతో మాసూళ్లు.. పశుగ్రాసానికి కొరత



తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అలంపురం- రావిపాడు రోడ్డులో ధాన్యం ఆరబోసిన రైతులు

పెంటపాడు: మండలంలో అనేక గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే మట్టి పుంతల దారులు గోతుల మయం కావడంతో వర్షాకాలంలో సార్వా సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి మాసూళ్లు, ధాన్యం రవాణాకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో 18 గ్రామాలకు చెందిన 6,800 మందికిపైగా రైతులు 12 వేల ఎకరాల్లో వరిసాగు, 1300 మందిపైగా రైతులు మూడు వేల ఎకరాలలో ఆక్వాసాగు చేస్తున్నారు. ప్రతి పంటకూ 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తున్నారు. చేల నుంచి పండిన ధాన్యాన్ని పుంత రహదారుల నుంచి ప్రధాన రహదారికి చేర్చి ఆరుదల చేసిన అనంతరం రైతులు రైస్ మిల్లులకు చేర్చే వరకు వరి మాసూళ్లలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. మాసూళ్లను కూలీలతో చేయిస్తే అధిక వ్యయమవుతుందని భావిస్తున్న రైతులు యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో వరి కోతలు పశుగ్రాసానికి ముప్పుగా మారింది.



మబ్బు కారణంగా బరకాలు కప్పుతున్న దృశ్యం

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు పోసయ్య ఎంపిక

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న ఎన్. పోసయ్య జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మన రాష్ట్ర జట్టు తరపున ఎంపికయ్యారు. ఆ వివరాలను హెచ్ఎం రాజేష్ తెలిపారు. త్వరలో జాతీయ స్థాయిలో మహారాష్ట్రలో జరిగే వాలీబాల్ పోటీలలో పోసయ్య పాల్గొంటారన్నారు. పోసయ్య ఎంపిక కావడం పట్ల ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌లతో పాటు, ఎస్ఎంసీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు అభినందనలు తెలిపారు.

మానసిక వికాస కేంద్రం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: పట్టణంలోని బలుసుమూడిలో శ్రీవేంకటేశ్వర బధిరుల పాఠశాల, జువ్వలపాలెం రోడ్డులోని సెంటర్ ఫర్ విజువల్ ఛాలెంజ్డ్ హోమ్, పెదఅమిరంలోని అరుణోదయ మానసిక వికాస కేంద్రాన్ని సోమవారం భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి వైద్య సదుపాయాలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. అలాగే నిత్యం వైద్యులు వస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల్లో సమస్యలను నిర్వహకులు న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుధీర్, బి.సురేష్ కుమార్, కె.జ్యోతి, డి.రవికిరణ్ పాల్గొన్నారు.